క్లుప్తంగా

కౌంటింగ్ రోజు సెలవు లేదు

కడియం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ వచ్చే నెల నాలుగో తేదీన జరుగుతున్నందున ఆ రోజు ప్రభుత్వోద్యోగులు ఎవరికీ సెలవు ఉండదని, తప్పనిసరిగా విధులకు హాజరు కావాలని ఎంపీడీఓ జి.రాజ్‌మనోజ్ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల విధుల్లో ఉన్నవారు అక్కడ హాజరవుతారని, మిగిలిన గ్రామ పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది కౌంటింగ్ రోజున ఆయా గ్రామాల్లో విధుల్లో ఉండాలన్నారు. ఆరోజు ఎవరికీ సెలవు మంజూరు చేయబడదని, ప్రతి ఒక్కరూ తమ విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల ఫలితాల సమయంలో గ్రామాల్లో జరిగే ర్యాలీలు, బాణసంచా కాల్పులు వంటివి హద్దు మీరుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

వ్యాపారి మృతికి రౌతు సంతాపం


మృతుని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రౌతు సూర్యప్రకాశరావు

రాజమహేంద్రవరం సిటీ: సెంట్రల్ వెజిటబుల్ మార్కెట్‌లో వ్యాపారి కరిబండి ఉమామహేశ్వర రావు మృతికి రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశ రావు సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక తిలక్ రోడ్‌లోని ఉమామహేశ్వరరావు గృహానికి వెళ్లి, ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఉమామహేశ్వరరావు తండ్రి రాజగోపాల్‌ను పరామర్శించి, బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రౌతు వెంట ది ఇన్నీసుపేట కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ అందనాపల్లి సత్యనారాయణ ఉన్నారు.

బడి బయట పిల్లలను గుర్తించాలి


వెల్ఫేర్ అసిస్టెంట్లలో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ

కడియం: మండలంలోని గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ జి.రాజ్‌మనోజ్ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు పెరిగేందుకు సహకారం అందించాలన్నారు. బడి మానేసిన విద్యార్థులను గుర్తించి, ఉపాధ్యాయులతో పాటు సచివాలయ ఉద్యోగులు వారిని బడికి తీసుకొచ్చే చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఒకటో తేదీ నుంచి పింఛను పంపిణీకి సంబంధించి మండల వ్యాప్తంగా పింఛనుదారుల బ్యాంకు ఖాతాల్లో నిధులు విడుదల చేస్తారన్నారు. బ్యాంక్ ఖాతాలు లేని వారికి వెల్ఫేర్ అసిస్టెంట్లు ఇంటికి తీసుకెళ్లి ఇవ్వాలని ఎంపీడీఓ రాజ్ మనోజ్ ఆదేశించారు.

12 మంది జూదరుల అరెస్టు

కడియం: కడియపులంక, వీరవరం గ్రామాల్లో పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.16,010 స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. సీఐ బి.తులసీధర్, ఎస్సైలు దుర్గాప్రసాద్, కృష్ణసాయి వేర్వేరు బృందాలుగా ఆయా దాడుల్లో పాల్గొన్నారు.

299 మంది బైండోవర్

కడియం: సార్వత్రిక ఎన్నికలు, కౌంటింగ్ ప్రక్రియ నేపథ్యంలో మండలంలో మొత్తం 299 మందిని బైండోవర్ చేసినట్టు కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ తెలిపారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్లు ఉన్నవారు, పలుమార్లు వివిధ కేసుల్లో అరెస్టు అయినవారు ఇందులో ఉన్నారన్నారు. వచ్చే నెల 4న కౌంటింగ్ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

ఎండే కాలం


నర్సరీలో మొక్కలకు నీటిని అందిస్తున్న రైతు

- వేసవిలో నర్సరీ మొక్కలకు గడ్డుకాలం
- సక్రమంగా నీరందక ఎండిపోతున్న మొక్కలు
- నీరందించేందుకు రైతుల అగచాట్లు
- వ్యాపారంపై తీవ్ర ప్రభావం

కడియం: మొక్కలంటే నర్సరీ రైతులకు చంటి బిడ్డలతో సమానం. శిశువులను సాకినట్టుగా.. వాటిని కంటికి రెప్పలా కాపాడేందుకు అహర్నిశలు శ్రమిస్తుంటారు. ఈ క్రమంలోనే వేసవి కాలం వచ్చిందంటే చాలు.. కడియం ప్రాంత నర్సరీ రైతులకు కంటి మీద కునుకుండదు. ఎండ తీవ్రత పెరిగేకొద్దీ మొక్కలను కాపాడుకునేందుకు రైతులు తీవ్రంగా కష్టపడుతుంటారు. గత మూడు వారాలుగా విపరీత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో కడియం ప్రాంత నర్సరీ రైతులంతా మొక్కల సంరక్షణ చర్యల్లో తలమునకలయ్యారు. మొక్కలకు తగినంత నీటిని అందించడంతో పాటు, విలువైన, సున్నితమైన మొక్కలను కాపాడుకునేందుకు షేడ్ నెట్లు వంటివి నెలకొల్పుతున్నారు. అంతేకాకుండా మొక్కల వరుసల మధ్య అవిసె, మొక్కజొన్న మొక్కలను నాటి తాత్కాలికంగా నీడనిచ్చే ఏర్పాట్లు చేస్తున్నారు.

రోజువిడిచి రోజు

కడియం, పరిసర ప్రాంతాల్లో సుమారు రెండు వేల నర్సరీలు ఉంటాయి. ఏప్రిల్ నెల వచ్చిందంటే చాలు రైతులకు అస్సలు తీరికుండదు. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఎండలు తీవ్రంగా ఉండడంతో నర్సరీల నిర్వహణ వారికి కత్తిమీద సాములా ఉంటుంది. ఈ నేపథ్యంలో రోజు విడిచి రోజు మొక్కలకు నీటిని అందించాల్సి వస్తోంది. ఎండలకు వేడిగాలులు కూడా తోడవ్వడంతో మొక్కలు ఉంచిన ప్యాకెట్లు, కుండీలు తడారిపోతున్నాయి. ఈ ప్రభావం మొక్కలపై పడి, వాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రతి రోజూ కానీ, రోజువిడిచి రోజు కానీ నీటిని అందించాల్సి వస్తోందని వివరిస్తున్నారు. మొక్కల ఎదుగుదలకు వేసవి ఎంతో ఉపయోగపడుతుందని, కానీ.. ఏ మాత్రం అటూఇటూ అయినా మొక్కలు చనిపోయేందుకు కూడా అవకాశం లేకపోలేదంటున్నారు. ఈ క్రమంలో విద్యుత్ మోటార్ల వినియోగం ఎక్కువ కావడంతో, నిర్వహణ వ్యయం కూడా పెరుగుతోంది. ఒకే మోటారుపై ఆధారపడే రైతులకు నీరు చాలడం లేదంటున్నారు. దీంతో వివిధ రకాల అలంకరణ, పువ్వులు, పండ్ల మొక్కలకు డీజిల్ ఇంజిన్ల సాయంతో నీటిని అందించాల్సి వస్తోంది.

కూలీలతో ఇబ్బందులు

వేసవి ఎండల తీవ్రత పెరిగే కొద్దీ నర్సరీ రైతులకు కూలీల లభ్యత కూడా కష్టంగా మారింది. ప్రతి రోజూ ఎండలో పనిచేసేందుకు కూలీలు ముందుకు రావడం లేదు. ఎక్కువ కూలి ఇస్తామన్నా ససేమిరా అంటున్నారు. దీంతో మొక్కలన్నింటికీ నీటిని అందించడం, వాటి సస్యరక్షణ బాధ్యతలు చూడడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని నర్సరీ రైతులు చెబుతున్నారు. ముఖ్యంగా వేసవిలో అత్యంత ప్రాధాన్యమున్న నీటిని అందించేందుకు కూలీల కొరత కూడా వేధిస్తోందంటున్నారు. నీరు అందుబాటులోనే ఉన్నప్పటికీ, కూలీలు రాకపోతే ఇబ్బందేనని వివరిస్తున్నారు. ఇలాఉండగా వేసవిలో కీలకమైన మూడు నెలలూ మొక్కల ఎగుమతి అంటూ ఏమీ ఉండదు. వేసవి మొక్కలు బతికుండడం కష్టమని.. వాటిని కొనేందుకు కూడా కొనుగోలుదారులు అంతగా ఆసక్తి చూపరు. అయా ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో నష్టాలు తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు మొదలయ్యాక, జూన్ రెండో వారం నుంచి నర్సరీల్లో మళ్లీ సాధారణ పరిస్థితులు నెలకొంటాయని రైతులు చెబుతున్నారు.

కనిపెట్టుకుని ఉండాలి

వేసవి కాలంలో మొక్కలను కనిపెట్టుకుని ఉండాలి. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా భారీ నష్టం తప్పదు. తగినంత నీటిని ఎప్పటికప్పుడు అందించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలి. నీటిని అందించడంలో ఏ మాత్రం ఆలస్యం చేసినా విలువైన మొక్కలు చనిపోతాయి. ఎండ తీవ్రత బారిన పడిన మొక్కలు తిరిగి పుంజుకోవడం కష్టం.

– కర్రి కొండయ్య, నర్సరీ రైతు

నీరు సరిపోవడం లేదు

ఒకటే విద్యుత్ మోటారు ఉంది. ఒకటిన్నర ఎకరాల విస్తీర్ణంలో నర్సరీ మొక్కలను పెంచుతున్నాను. వేసవి తీవ్రత పెరిగిపోవడంతో నీరు సరిపోవడం లేదు. సగం నర్సరీకి ఒకరోజు, ఇంకో సగం నర్సరీకి మరో రోజు నీటిని పెడుతున్నాను. ఇంకా ఎండలు పెరిగితే ప్రతి రోజూ నీరు పెట్టాల్సిన అవసరం ఉండవచ్చు. అప్పుడు ఇబ్బందులు తప్పవు.

– కె.భాస్కర్, నర్సరీ రైతు

విశ్వేశ్వరరెడ్డికి రుడా చైర్మన్ రౌతు అభినందన


విశ్వేశ్వరరెడ్డిని అభినందిస్తున్న రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్, గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు, రాజమహేంద్రి వారసత్వ పరిరక్షణ సమితి కన్వీనర్ టీకే విశ్వేశ్వర రెడ్డికి గౌరవ డాక్టరేట్ లభించడంపై రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు అభినందనలు తెలిపారు. ది ఎవల్యూషన్ బోర్డు ఆఫ్ ది బ్రిటిష్ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ క్వీన్ మేరీ నుంచి టీకే విశ్వేశ్వరరెడ్డి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. బుధవారం మోరంపూడిలోని ఓ ప్రైవేట్ కార్యక్రమంలో కలిసిన విశ్వేశ్వరరెడ్డిని రౌతు సూర్యప్రకాశరావు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. వివిధ సామాజికాంశాలపై నిరంతరం శ్రమిస్తూ, ప్రజల పక్షాన ఉద్యమాలు చేస్తున్న విశ్వేశ్వరరెడ్డి విదేశీ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకోవడం నగరానికే కాదు, రాష్ట్రానికే తలమానికమన్నారు. వీరి వెంట మాజీ కార్పొరేటర్ వాకచర్ల కృష్ణ, పెదిరెడ్ల శ్రీనివాస్, అందనాపల్లి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పోలీసుల మాక్ డ్రిల్

మధురపూడి: మండల కేంద్రమైన కోరుకొండ బస్టాండ్ సెంటర్‌లో పోలీసులు బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. కోరుకొండ ఎస్సై ఆనందకుమార్ ఆధ్వర్యంలో సుమారు వంద మంది పోలీసులతో ఈ మాక్ డ్రిల్ జరిగింది. స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం రోడ్డు, మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో డ్రిల్ నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా, నియంత్రణ చర్యల్లో భాగంగా మాక్ డ్రిల్ నిర్వహించారు.

నేడు హనుమంతుడికి క్షీరాభిషేకం

పెదపూడి: వచ్చే నెల 1వ తేదీన హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గురువారం పెదపూడిలోని జనార్దనస్వామి ఆలయంలో హనుమంతుడికి క్షీరాభిషేకం, హోమాలు నిర్వహించనున్నట్లుగా అర్చకుడు కాశ్యపు శర్మ తెలిపారు. హనుమంతుని మాల ధారణ గావించిన భక్తులంతా ప్రత్యేక పూజలు చేస్తారన్నారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై కార్యక్రమం జయప్రదం చేయాలని ఆయన కోరారు.

1న ఆంజనేయస్వామికి అప్పాల పూజ

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట గ్రామంలోని చిన కొత్తూరులో కొలువైఉన్న అభయ ఆంజనేయస్వామి వారి జయంత్యుత్సవం జూన్ 1వ తేదీ వైశాఖ శుద్ధ నవమి రోజున ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆ రోజు విష్ణుశ్వర పూజ, ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష అప్పాలతో పూజ నిర్వహిస్తామన్నారు. అందుకు అవసరమైన అప్పాలను కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో తయారు చేస్తున్నామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

మూమెంట్ రిజిస్టర్ తప్పనిసరిగా నిర్వహించాలి

పెదపూడి: గ్రామ సచివాలయ కార్యదర్శులు మూమెంట్ రిజిస్టర్ తప్పనిసరిగా నిర్వహించాలని ఎంపీడీఓ పి.ఆశాజ్యోతి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సచివాలయం కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ కార్యదర్శులు శాఖాపర పనుల నిమిత్తం బయట ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా ఆయా పంచాయతీ డీడీఓ ఆదేశాలపై రాతపూర్వకంగా అనుమతి తీసుకోవాలన్నారు. ఈఓపీఆర్డీ, ఎంపీడీఓ సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తారన్నారు. సచివాలయం వద్ద ఉన్న బ్లాక్‌బోర్డుపై సచివాలయ కార్యదర్శుల పర్యటన వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

అడ్డుకట్ట వేసిన వారిపై కేసు పెడతాం

పెదపూడి: మండల కేంద్రమైన పెదపూడి గ్రామంలో పాగాడి పంట కాలువపై అక్రమంగా అడ్డుకట్ట వేసి లారీలతో మట్టిని తరలించిన వారిపై కేసు పెడతామని మండల ఇరిగేషన్ ఏఈ బి.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆయన పెదపూడిలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ స్థానిక మాచరమ్మ తల్లి ఆలయం సమీపంలో పంట కాలువలో అడ్డుగా సిమెంట్ తూములు వేసి దారి ఏర్పాటు చేసి నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా మట్టి తరలించారన్నారు. బుధవారం ఘటనా స్థలాన్ని సందర్శించి జేసీబీ సాయంతో కాలువలో వేసిన అడ్డుకట్టను తొలగించామన్నారు. అక్రమంగా అడ్డుకట్ట వేసి మట్టి తరలించినవారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయిస్తామన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): చిన్నతనం నుంచే యోగాను అలవర్చుకుంటే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు మల్లికార్జునరావు అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆదేశాల మేరకు బుధవారం స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు మల్లికార్జునరావు విద్యార్థులకు నీతికథలను బోధించారు. యోగా టీచర్ సబ్బిశెట్టి లీలాసుందరి సూర్య నమస్కారాలు, చక్రాసనం, పద్మాసనం, భుజంగాసనం, తాడాసనం, ప్రాణాయామం తదితర ఆసనాలు నేర్పించారు. టీచర్ ముచ్చెర్ల నాగ దుర్గ విద్యార్థులకు పుస్తక పఠనం ఆవశ్యకత తెలియజేశారు. గ్రంథాలయంలోని బాల సాహిత్యానికి సంబంధించిన చందమామ కథలు, దశావతారాల పుస్తకం చదివించారు చెస్ మాస్టర్ కంచుమర్తి జగన్నాథం చదరంగంలో మెళకువలను నేర్పించారు. కర్ణాటక సంగీత టీచర్ కారుమూరి వీర రత్నకుమారి లలిత సంగీతం, కోలాటం తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పొడిపిరెడ్డి శ్రీను, బొడ్డు శ్రీనివాసు, బందారు శంకరరావు, లైబ్రేరియన్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వాతవరణం


ఎండ ధాటికి నిర్మానుష్యంగా మారిన వై.జంక్షన్ రోడ్డు

ప్రకాశం నగర్: రాజమహేంద్రవరం బుధవారం ఎండ ధాటికి నిర్మానుష్యంగా మారింది. వేసవి తీవ్రతకు తోడు.. వేడిగాలులు తోడవ్వడంతో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే వై.జంక్షన్, కంబాల చెరువు హైటెక్ బస్టాండ్, నందం గనిరాజు జంక్షన్, దేవీచౌక్, పేపర్ మిల్లు రోడ్డు, మెయిన్ రోడ్డు వంటి ప్రధాన ప్రాంతాల్లో జన సంచారం కనుమరుగైంది. నగరమంతా కర్ఫ్యూ వాతావరణాన్ని తలపించింది. మంగళ, బుధవారాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం జనాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. జనం ఎండ వేడిమి, ఉక్కపోతతో అల్లాడుతున్నారు. సాయంత్రం వరకూ ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు.

మైనర్లకు వాహనమిస్తే జైలు తప్పదు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): వాహన యజమానులు నిర్లక్ష్యంగా మైనర్లకు వాహనాలు ఇస్తే.. వారికి జైలు శిక్ష తప్పదని జిల్లా ఎస్పీ పి.జగదీష్ హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా మైనర్ల డ్రైవింగ్‌పై జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మొత్తం 80 వాహనాలు సీజ్ చేసి, వాహన యజమానుల నుంచి జరిమానాలు వసూలు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో మైనర్ల తల్లిదండ్రులు, సంరక్షకులు, పెద్దలకు కౌన్సెలింగ్ నిర్వహించి, రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇకనుంచి మైనర్లకు వాహనాలు ఇచ్చిన వాహనదారులకు, మైనర్ల తల్లిదండ్రులు, సంరక్షుల లైసెన్సులూ రద్దు చేయడంతో పాటు, ఇతర చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను అనుసరించాలని, ఇది ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. కొద్దిపాటి నిర్లక్ష్యం కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగుల్చుతుందన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వారు మాత్రమే వాహనాలను నడపాలని సూచించారు. అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మంచి జీర్ణక్రియే శరీర ఆరోగ్యానికి మూలం


సమావేశంలో మాట్లాడుతున్న తోరాటి ప్రభాకరరావు

రాజమహేంద్రవరం రూరల్: మానవ శరీరం ఆరోగ్యంగా ఉండడానికి మంచి జీర్ణక్రియ సహకరిస్తుందని పీఎంపీ సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోరాటి ప్రభాకరరావు, వీబీటీ రాజు అన్నారు. ప్రపంచ జీర్ణ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కమ్యూనిటీ పారా మెడిక్స్–ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీఏ) ఆధ్వర్యంలో బుధవారం హుకుంపేటలో జరిగిన కార్యక్రమానికి సంఘ రాజమండ్రి శాఖ అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ ఖాన్ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన తోరాటి ప్రభాకరరావు, వీబీటీ రాజు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంరక్షణలో కీలకమైన పీఎంపీలు ఎప్పటికప్పుడు వైద్య విజ్ఞానాన్ని పెంపొందించుకోవడం వల్ల మెరుగైన వైద్య సేవలు అందించవచ్చన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల్లో విరివిగా పాల్గొని సేవలందించాలని సూచించారు. ప్రతి పీఎంపీ తప్పనిసరిగా ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్ పొంది ఉండాలని, జూన్‌లో సంఘం తరఫున అందించే ఫస్ట్ ఎయిడ్ శిక్షణకు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు బళ్ల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.దేవానందం, జిల్లా కోశాధికారి పి.చిన్ని, మండల కార్యదర్శి మట్టా రమేష్, కోశాధికారి యు.ప్రసాద్ బాబు, కేఎస్ఎస్ఎన్ రెడ్డి, ఏ సురేష్‌బాబు, సుంకర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లాస్య ఆరోగ్య పరిస్థితిపై మంత్రి వేణు ఆరా


లాస్య ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడుతున్న మంత్రి వేణు

కడియం: వేమగిరి గ్రామానికి చెందిన చిన్నారి లాస్య ఆరోగ్య పరిస్థితిపై మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆరా తీశారు. బుధవారం ఆయన స్వయంగా లాస్య చికిత్స పొందుతున్న ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి, అక్కడి వైద్యులు, చిన్నారి తల్లిదండ్రులతో మాట్లాడారు. కిడ్నీ సమస్యతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న లాస్య వైద్య ఖర్చులకు మంత్రి వేణు హామీ ఇచ్చారు. ఎప్పుడు, ఏ సాయం అవసరమైనా తనను సంప్రదించేందుకు వెనుకాడవద్దని, చిన్నారిని ఆదుకుంటామని మంత్రి వేణు తెలిపారు.

కూలీకి తీవ్ర గాయాలు

సీతానగరం: మోటార్ బైక్ అదుపుతప్పిన సంఘటనలో ఇనుగంటివారిపేట గ్రామానికి చెందిన షేక్ నాగూర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం–సీతానగరం రోడ్డులో ఇనుగంటివారిపేట వద్ద మంగళవారం రాత్రి కూలీ పని చేసే నాగూర్ డివైడర్‌ను దాటుతున్నాడు. అదే సమయంలో వెదుళ్లపల్లికి చెందిన యువకులు మోటారు బైక్‌పై వస్తూ, అదుపు తప్పి నాగూర్‌ను ఢీకొన్నారు. ఈ ఘటనలో నాగూర్ కుడికాలుకు విరిగి, తీవ్ర రక్త స్రావమైంది. స్థానికుల సమాచారంతో క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై తమకు సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

రైతు కష్టం.. గాలిలో దీపం


పొలంలో వేసి ఉన్న వరికుప్పలు

- పొలాల్లోనే వరి కుప్పలు
- పంట చేతికొచ్చే వరకూ భయమే..
- వేసవిలోనూ అగ్ని ప్రమాదాల ముప్పు

సీతానగరం: రైతులు రబీలో వేసిన పంట రద్దుకు నిప్పు పెట్టే సమయంలో పలు వరికుప్పలు అగ్ని ప్రమాదంలో కాలిపోయిన సంఘటనలు గతంలో జరిగాయి. ఖరీఫ్‌లో వేసిన వరి పంట కోతలు జరిపిన అనంతరం కొంతమంది రైతులు వరి కుప్పలుగా వేస్తారు. అనంతరం రబీ సీజన్‌లో ఆరుతడి పంటలు, దాళ్వా, మొక్కజొన్న వంటి పలు రకాలైన పంటలు వేసి, ఆ పంట చేతికొచ్చిన అనంతరం వరికుప్పలను నూర్పుడు జరుపుతారు. మండలంలో ఖరీఫ్‌లో పండించిన వరి ఐదు వేల ఎకరాల వరకు వరికుప్పలు వేశారు. ఏప్రిల్, మే నెలల్లో వరికుప్పలను నూర్పుడు జరిపి ధాన్యాన్ని విక్రయిస్తారు. వరికుప్పల నూర్పిళ్లకు కూలీల కొరత నెలకొంది. ఉపాధిహామీ పనులకు వెళ్లడంతో కూలీలు వరికుప్పల నూర్పిడికి వచ్చేందుకు ఇష్టపడటం లేదు.

పొంచి ఉన్న ముప్పు

వాతావరణ మార్పులు, గాలివానలు, అగ్నిప్రమాదాలు వంటి వాటికి రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు పశువుల మేతకు వెళ్లిన కాపలాదారులు తప్పిదాలతో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. పొలాల్లో పంట రద్దుకు నిప్పు పెట్టే సమయంలో జరిగే తప్పిదాలకు వరికుప్పలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి.

అగ్నిమాపక కేంద్రం అవసరం

మండలంలోని గ్రామాల్లో జరిగే అగ్నిప్రమాదాల నివారణకు అగ్నిమాపక కేంద్రం రాజమహేంద్రవరంలో ఉండటంతో, ఫైరింజన్లు సంఘటన స్థలానికి ఆలస్యంగా చేరుతున్నాయి. దీనితో నష్ట నివారణ సాధ్యం కావడం లేదు. ఈ క్రమంలోనే మండలంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఏం జరుగుతుందోనని భయం



మూడు ఎకరాల వరిపంటను ఖరీఫ్‌లో కుప్పలు వేశాను. దాళ్వాలో పంటను మెషీన్‌తో కోతలు జరిపి, ధాన్యం విక్రయించాను. పొలంలో ఉన్న వరికుప్పలకు రక్షణ లేదు. ఏ సమయంలో అగ్ని ప్రమాదం జరుగుతుందోననే భయం వెంటాడుతోంది. ఇప్పుడు కూలీల కొరత ఎక్కువగా ఉంది. మండలంలో అగ్నిమాపక కేంద్రం ఉంటే బాగుండేది.

– ఎస్.దుర్గయ్య, లంకూరు

జాగ్రత్తలు తీసుకోవాలి



వేసవిలో రైతులు భయందోళనలో ఉంటారు. సమీప పొలంలో రైతులు మొక్కజొన్న తుక్కుకు నిప్పు పెట్టే సమయంలో వరికుప్పలకు మంటలు వ్యాపించే అవకాశం ఉంది. రైతులు మొక్కజొన్న తుక్కుకు నిప్పు పెట్టే సమయంలో పక్కనున్న వరి కుప్పల రైతులకు సమాచారమివ్వాలి. వేసవిలో ఎండ తీవ్రతతోనూ పొలాల్లో అగ్నిప్రమాదాలు జరుగుతుంటాయి. మండలంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తే అందరికీ ఉపయోగం.

– చిర్రవూరి మధుసూదనరావు, సీతానగరం

వ్యక్తి అదృశ్యం


దేరంగుల శివకుమార్ (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: హైదరాబాద్ నుంచి వచ్చిన వ్యక్తితో మాట్లాడి వచ్చేస్తానని చెప్పి వెళ్లిన తన భర్త ఇంటికి తిరిగిరాలేదని శాటిలైట్‌సిటీ గ్రామం ఇందిరమ్మ కాలనీకి చెందిన లక్కోజు శ్రీదేవి బుధవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం శాటిలైట్‌సిటీ ఇందిరమ్మ కాలనీకి చెందిన 36 ఏళ్ల దేరంగుల శివకుమార్ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం 1.30 సమయంలో శివకుమార్ హైదరాబాద్ నుంచి ఎవరో వచ్చారని, సెంటర్‌లో ఉన్న వారితో మాట్లాడి వస్తానని వెళ్లాడు. అప్పటి నుంచి తిరిగి రాలేదని, సెంటర్‌లోను, బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదని శ్రీదేవి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు బొమ్మూరు ఎస్సై అంకారావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.